ఓటు హక్కు వినియోగించుకోవాలి

సీసీసీ నస్పూర్, మే 12 : ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గోదారి వెంకటసాయి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఓటు అనే ఒక వజ్రాయుధం లాంటిదన్నారు. మంచిర్యాల జిల్లాలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ ఉంటుందని ప్రజలు గమనించాలన్నారు. వేసవి కాలం కాబట్టి ఎండరాక ముందే ఆయా ప్రాంతాల్లోని కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని కోరారు.

ఘనంగా మదర్స్ డే

వృద్ధురాళ్లను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నస్పూర్, మే 12 : మంచిర్యాలలోని ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో ఆదివారం మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సబ్యుడు మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి రజనీరెడ్డి వృద్ధురాళ్లను శాలువాలతో సన్మానించి పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో సభ్యులు మహేందర్, కిషన్, ఆశ్రమం నిర్వాహకులు సదానందం, తిరుమల పాల్గొన్నారు.

మహిళా పోలింగ్ కేంద్రం ఏర్పాటు

పోలింగ్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న పంచాయతీ కార్యదర్శి కవిత, అధికారులు

కాసిపేట, మే 12 : కాసిపేట మండలంలోని దేవాపూర్‌లోని 13వ పోలింగ్ కేంద్రాన్ని మహిళా పోలింగ్ స్టేషన్‌గా ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బందికి కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో స్వాగతం పలికి ఉత్తమ పోలింగ్ నిర్వహించాలని సూచించారు.

ఆర్థిక సాయం

ఎల్ఐసీ బాండు అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

సీసీసీ నస్పూర్, మే 12 : సీసీసీ నస్పూర్‌లోని నాగార్జున కాలనీకి చెందిన తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి నాగార్జున హైస్కూల్‌లో చదువుకున్న 2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.42వేల నగదును ఎల్ఐసీలో ఫిక్స్‌డ్ చేసి బాండ్‌ను అందజేశారు. తిరుపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ మారపాక సంపత్, పోలు కుమార స్వామి, మల్గోజు సతీశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

మందమర్రి : పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కోటపల్లి : పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, అధికారులు

హాజీపూర్ : పోలింగ్ కేంద్రం ముందు ఏర్పాటు చేసిన టెంట్లు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

చెన్నూర్ : పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

లక్షెట్టిపేట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బందితో మున్సిపల్ కమిషనర్

హాజీపూర్ : వేంపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

చెన్నూర్, మే 12 : పెద్దపల్లి లోకసభ ఎన్నికల్లో భాగంగా మంచిర్యాల జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చెన్నూర్ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి చంద్రకళతో ఏర్పాట్లపై చర్చించారు. అలాగే డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు పోలింగ్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. నియోజకవర్గంలో పురుషులు 96,019, మహిళలు 97,752, ఇతరులు ఏడుగురుతో కలిపి మొత్తం 1,93,778మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందు కోసం నియోజకవర్గంలో 227పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణ కోసం 272మంది పీవోలు, 272 మంది ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లు 30, పోలీసు సిబ్బంది 608 మందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది, సామగ్రిని కేంద్రాలకు తరలించేందుకు 33 ఆర్టీసీ బస్సులు, 34 ఇతర ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రితో సిబ్బంది ఆదివారం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

మందమర్రి మండలంలో..

మందమర్రి/ మందమర్రి రూరల్, మే 12: మందమర్రి మండల పరిధిలో రెండు మున్సిపాలిటీలు, 10 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 79,052 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 39,234 మంది పురుషులు, 39,814 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల పరిధిలో 90 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 170 మంది పోలీసు, చత్తీస్‌ఘడ్, టీఎస్‌పీఎఫ్, సింగరేణి ఎస్ అండ్ పీసీ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

కోటపల్లి మండలంలో..

కోటపల్లి, మే 12 : కోటపల్లి మండలంలో ఏర్పాటు చేసిన 33 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం సిబ్బంది చేరుకున్నారు. మొత్తం 26571 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

హాజీపూర్ మండలంలో..

హాజీపూర్, మే 12 : పెద్దపల్లి లోకసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో పోలింగ్‌కు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధులను నిర్వహించేందుకు అధికారులు ఆదివారం సాయంత్రం ఎస్ఐ సురేశ్ ఆధ్వర్వంలో భారీ బందోబస్తు మధ్య ఆయా గ్రామాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మండలంలో 32 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 27,116 మంది ఓటర్లు ఓటు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు ఒక ఏఆర్ఓ, రూట్ ఆఫీసర్లు ముగ్గురు, సెక్టర్ ఆఫీసర్లు ముగ్గురు, పోలీస్ కానిస్టేబుళ్లు 160 మంది, ఒక్కొక్క పోలింగ్ బూత్‌లో 5 వీవీప్యాట్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్‌తో పాటు మొత్తం160 అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ ఆధ్వర్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

జన్నారం మండలంలో..

జన్నారం, మే 12 : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని 54 పోలింగ్ బూత్‌ల్లో సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 43,335 మంది ఓటర్ల ఓటు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో పురుషులు 21,154, మహిళలు 22,181 మంది ఓటు హక్కును వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

లక్షెట్టిపేట మండలంలో..

లక్షెట్టిపేట, మే 12 : మండలంలో మొత్తం 47 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని మున్సిపాలిటీలో 10 సెంటర్లకు గాను 18 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ పరిశీలించి సిబ్బందికి అన్ని వసతులు కల్పించారు. మండలంలో 238 మంది సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారని ఒక్కో కేంద్రంలో నలుగురు చొప్పున ఎన్నికల విధులు నిర్వహిస్తారని తెలిపారు.

తాండూర్ మండలంలో..

తాండూర్, మే 12 : తాండూర్ మండలంలోని 37 పోలింగ్ బూత్‌ల్లో మొత్తం 27,209 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం నాలుగు రూట్లుగా విభజించి నలుగురు సెక్టర్ అధికారులను నియమించారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ప్రిసిడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసిడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ క్లర్క్‌లు, ఒక మైక్రో అబ్జర్వర్, ఇద్దరు కానిస్టేబుళ్ల చొప్పున మొత్తం ఎనిమిది మంది ఒక్కో పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తిస్తారు. తాండూర్ సర్కిల్ పరిధిలో ఎన్నికల నిర్వహణ, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యవేక్షణకు గాను తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో మాదారం, తాండూర్ ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలో 4రూట్ మొబైల్, క్విక్ రియాక్షన్, స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు.



వేమనపల్లి : పోలింగ్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న సెక్టార్ అధికారులు

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

వేమనపల్లి, మే 12 : వేమనపల్లి, బద్దంపల్లి, చామనపల్లి, నీల్వాయి, మామడ, కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, గొర్లపల్లి, దస్నాపూర్, రాజారాం, సుంపుటం, జాజులపేట, నాగారం, సూరారం, జిల్లెడ, జక్కెపల్లి, బుయ్యారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. వీరికి సెక్టార్ అధికారులు శ్రీపతి బాపురావు , గిరిధర్, నరేశ్ స్వాగతం పలికారు. బీఎల్ వోలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి, మే 12 : మండలంలోని 49 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో ఓటింగ్ యంత్రాలతో చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని అధికారులు తెలిపారు. మండలంలో 41,301 మంది ఓటర్లు ఉండగా 20,147 మంది పురుషులు, 21153 మంది మహిళు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

దండేపల్లి: ఓటింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది

తాండూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు

తాండూర్: మాదారంలో పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు ఎన్నికల సామగ్రి

కాగజ్‌నగర్, మే 12 : నేడు నిర్వహించనున్న ఆదిలాబాద్ లోకసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సిర్పూర్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ ఏర్పాటు చేయగా నియోజకవర్గంలో మొత్తం 330 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెగ్యులర్ 293, అదనపు కేంద్రాలు 27 ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కో కేంద్రానికి నలుగురు చొప్పున మొత్తం 1430 మంది పోలీసు బందోబస్తు నిర్వహిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 22,9101 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

బెజ్జూర్ మండలంలో..

బెజ్జూర్, మే 12 : మండలంలో మొత్తం 38 పోలింగ్ కేంద్రాల్లో 23,884 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా రూట్లలో రూట్ ఆఫీసర్ల సలహాలు, సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద కరెంట్, మూత్రశాలలు, ఇతర త్ర వసతులను సిబ్బంది పరిశీలించుకున్నారు. ఏదైనా అవసరాలుంటే రూట్ ఆఫీసర్లు ఏర్పాటు చేశారు.

రెబ్బెన మండలంలో..

రెబ్బెన, మే 12: రెబ్బెన మండలంలో 28,458 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 14,420 మంది, మహిళలు 14038 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ జ్యోత్స్న తెలిపారు. మండలంలో 47 పోలింగ్ కేంద్రాలకు 47 మంది ప్రిసైడింగ్ అధికారులు, 47 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఇద్దరు సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు 70 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని సీఐ చిట్టిబాబు తెలిపారు.

కాగజ్‌నగర్ : పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్, మే 12: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 21 పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నాలుగు రూట్లుగా విభజించారు. వీటికి గాను నలుగురు రూట్ ఆఫీసర్లు, నలుగురు సెక్టోరియల్ ఆఫీసర్లను అధికారులు నియమించారు. ఆదివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

దహెగాం మండలంలో..

దహెగాం,మే 12 : మండలంలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. మండంలో 26078 మంది ఓటర్లు ఉండగా అందులో 13014 మంది పురుషులు,13064 మహిళలు ఓట్టు హక్కును వినియోగించుకోనున్నారు. 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 172 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. అదేవిధంగా మరో 60 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

జైనూర్, మే 12 : జైనూర్ మండలంలో ఏర్పాటు చేసిన 33 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 33 పోలింగ్ కేంద్రాలకు నాలుగు రూట్లుగా విభజించి 132 మంది రూట్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే విధంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

భీమారం కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

- ఎవరికి వారే.. అన్నట్లుగా వ్యవహారం
- కొత్తగా వచ్చిన వారికి పెత్తనమేమిటని ఆవేదన

భీమారం, మే 12 : భీమారం కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. దళిత నాయకులు ఓ వైపు ఉండగా, అగ్రకుల నాయకులు మరో వర్గంగా ఏర్పడి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వివేక్ అభిమానులు ఆయన ఏ పార్టీలో ఉన్నా.. ఆయన వెంటే ఉంటూ వస్తున్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న నాయకులు, ఎమ్మెల్యే ఎన్నికల ముందు పార్టీలో చేరిన నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి వర్గానికి ఒకరికొకరికి పొసగడం లేదు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి, తన కుమారుడు వంశీ గెలుపుకోసం నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే వివేక్ ప్రచారానికి ఎల్కేశ్వరం గ్రామానికి రాగా, ఓ స్థానిక నాయకుడు ఎమ్మెల్యేకు తన బాధను వెళ్లబోసుకున్నాడు. ఇప్పుడు వచ్చిన వారికి పెత్తనమేమిటని, తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో వివేక్ ఆయనకు నచ్చజెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. ఇక స్థానిక మాజీ సర్పంచ్‌తో పాటు మరి కొంత మంది నాయకులకు సమాచారం అందించకుండానే ఇటీవల ఓ అగ్రకుల నాయకుడు ఎల్కేశ్వరం గ్రామంలో ప్రచారం నిర్వహించగా, అది కాస్త బెడిసికొట్టింది. తమకు సమాచారం ఇవ్వకుండా ప్రచారానికి ఎలా వచ్చారంటూ స్థానికులు ప్రశ్నించగా, ఆ నాయకుడు అక్కడి నుంచి అలిగి వెనక్కి వెళ్లిపోయాడు. ఇక కాంగ్రెస్ మండల అధ్యక్షుడి మాటను సైతం ఇక్కడ ఎవ్వరూ లెక్క చేయడం లేనట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్‌లో ఇన్ని వర్గాలు ఏమిటీ అని స్థానికులు బహిరంగంగానే చర్చించుకోవడం కొసమెరుపు.

రక్తదానం

రక్తదానం చేసిన బీఆర్ఎస్ యువకులు

బెల్లంపల్లి, మే 12 : రెడ్‌క్రాస్ వారి సహకారంతో బెల్లంపల్లికి చెందిన 30 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన యువకులు రక్తదానం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పుట్టిన రోజు పురస్కరించుకొని బీఆర్ఎస్ పట్టణ యూత్ నాయకుడు చరణ్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. రక్తదాతలను బ్లండ్ బ్యాంకు నిర్వాహకులు అభినందించారు.

అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ

పండ్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్ దంపతులు

సీసీసీ నస్పూర్, మే 12 : నస్పూర్ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎనగందుల వెంకటేశ్ వివాహ వేడుకలను ఆదివారం సీసీసీలోని శ్రీసాయి అనాథ వృద్ధుల ఆశ్రమంలో జరుపుకున్నారు. వెంకటేశ్ దంపతులు వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ సాయి వృద్ధాశ్రమ వెల్ఫేర్ సోసైటీ అధ్యక్షుడు కేఎల్ మూర్తి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.